క్లుప్తంగా

వ్యాసరచన పోటీలు



పెర్కిట్: అంతర్జాతీయ సహకార సంఘం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం సొసైటీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సొసైటీ చైర్మన్ తంబూరి శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో మల్లేశ్, సిబ్బంది ముత్యం, గంగన్న, శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌట్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి హైస్కూల్‌లో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి ఆధ్వర్యంలో మానవ సంబంధాలపై సాంకేతిక ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేట్ స్కూళ్ల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఎంఈవో ఆంధ్రయ్య మాట్లాడుతూ.. సాంకేతికను సరైన మార్గంలో వినియోగించుకుంటే అద్భుతమైన ఫలితాలు ఉంటాయని అన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లుక్క గంగాధర్, కోశాధికారి తెడ్డు రమేశ్, సభ్యులు బద్రీ, ప్రదీప్, పవన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

బోధన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి శాఖ గురువారం సాలూర మండలంలోని హున్సా గ్రామ మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించింది. విజేతలకు క్లబ్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. క్లబ్ ప్రతినిధులు చక్రవర్తి, శ్రీనివాస్‌రాజు, సత్యనారాయణ, ఆదినారాయణ రెడ్డి, ఇల్తెపు శంకర్, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మాక్లూర్: కల్లెడి గ్రామంలో 12 మంది బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీజేపీ సీనియర్ నాయకుడు గంగోళ్ల ప్రశయ్ తేజ్ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి చంద్రశేఖర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎం శ్రవణ్య, ఎం అశోక్, మచ్చర్ల అర్జిత్, బి నగేశ్, పి నరేందర్, బాషెట్టి గంగాధర్, సిరికొండ సాయికుమార్ పాల్గొన్నారు.

నీటిని తొలగించండి సారూ..



బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీని ఆనుకుని వర్షపు నీరు కుంటను తలపించేలా ఉంది. దీంతో ఆ నీటిని తొలగించండి సారూ అంటూ కళాశాల విద్యార్థులు వేడుకుంటున్నారు. నీటి నిల్వ ఎక్కువ రోజులుగా ఉండటంతో నీరు మొత్తం పచ్చని రంగులోకి మారిపోయాయి. మురుగుగా మారి దోమలకు ఆవాసంగా తయారైందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే నీటిని తొలగించాలని కోరుతున్నారు.

నిధులు మంజూరు

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో షాదీఖానా నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నుంచి రూ.5 లక్షల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి తెలిపారు. గురువారం నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. నాయకులు పడిగెల ప్రవీణ్, రేవతి గంగాధర్, గోపిడి లింగారెడ్డి, మహ్మద్ అబ్దుల్ రఫీ, కుందేటి శ్రీను, ఏనుగు రాజేశ్వర్, మోహన్‌నాయక్, ఎడ్ల శ్రీకాంత్, ఏనుగు మనోహర్, పెద్ది సృజన్, మహేందర్, రవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి వితరణ



బోధన్: ఎడపల్లి మండలంలోని అంబం(వై) ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.95 వేల విలువ చేసే చదువు సామగ్రిని ప్రవాస భారతీయులు కె.రాహుల్, జి.అజయ్, ధర్మవీర్, నిఖిల్, రేఖ, లయన్స్ క్లబ్ హైదరాబాద్ శాఖ ప్రతినిధులు వితరణ చేశారు. గురువారం ఆ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో అశోక్ చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఇందులో విద్యార్థులకు క్రీడా దుస్తువులు, బూట్లు, టై, బెల్టులు, ఆట వస్తువులు, ఐడీ కార్డులు ఉన్నాయి. ఈ సందర్భంగా డీఈవో, ఎంఈవో శివలింగ్ గాలప్పను ప్రవాస భారతీయులు ఘనంగా సన్మానించారు. కాంప్లెక్స్ స్కూల్ హెచ్ఎం సురేందర్, హెచ్ఎం శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప, ఉపాధ్యాయులు స్వామి, గౌస్, వైశాలి, సరోజ, జనాబాయి తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత గ్రామం @ మెట్టు

- ప్రభుత్వ ఉద్యోగులు, క్రీడాకారులు అధికం
- 20ఏళ్లలో పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కని గ్రామస్తులు



మెట్టు గ్రామ ముఖచిత్రం

మాక్లూర్ : అక్షరాస్యత దారిద్ర్యాన్ని దూరం చేస్తుందనే జాతిపిత మహాత్మా గాంధీ చెప్పిన మాటల్ని అనుసరిస్తున్నదీ గ్రామం. స్వాతంత్ర్య ఫలాలను అందిపుచ్చుకొని వందశాతం అక్షరాస్యతతో మాక్లూర్ మండలంలోని మెట్టు గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. గంగరమంద గ్రామ పంచాయతీకి అమ్లెట్ విలేజీగా ఉన్న మెట్టును గత ప్రభుత్వం గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. గ్రామంలో సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్నాయి. జనాభా లెక్కల ప్రకారం 380 మంది ప్రజలు ఉండగా, వంద శాతం అక్షరాస్యత కలిగిన గ్రామంగా పేరొందింది. గ్రామంలో 84 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 16 మంది రిటైర్డ్ ఉద్యోగులు, 19 మంది కాంట్రాక్ట్ సిబ్బంది ఉన్నారు. అలాగే గ్రామంలోని పలువురు క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణిస్తూ దేశకీర్తిని నిలబెడుతున్నారు. గ్రామంలో ఘర్షణలకు తావుండదు. గడిచిన 20 సంవత్సరాల్లో గ్రామస్తులు ఒక్కసారి కూడ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన దాఖలాలు లేవు. గ్రామంలో అత్యధికంగా క్రిస్టియన్లు నివసిస్తుండటంతో ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో జరిగే క్రిస్మస్ పండుగను గ్రామస్తులంతా ఉమ్మడిగా జరుపుకుంటారు. ఇలా ఈ గ్రామం అన్నిరంగాల్లోనూ ముందుండి ఆదర్శంగా నిలుస్తుంది.

చదువుకు ప్రాధాన్యం



మా గ్రామంలో పిల్లల చదువుకు ప్రాధాన్యత ఇస్తాం. అలాగే ప్రతి ఇంటిలోని పిల్లలు ఏదో ఒక ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడుగా నిలుస్తారు. ఘర్షణలకు తావుండదు. నాకు తెలిసి గొడవలు పడి పోలీస్‌స్టేషన్ వెళ్లిన సందర్భాలూ లేవు. ఎవరి పనులు వారు చేసుకోవటంలో బిజీగా ఉంటాం.

–సుధీర్, వెటర్నరీ ఉద్యోగి

క్రీడల్లోనూ రాణిస్తున్నారు..



మా గ్రామంలో పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు వెనుకడుగు వేయరు. పిల్లల ఆసక్తి మేరకు క్రీడలను కూడా ప్రోత్సహిస్తారు. నేను చదువుతోపాటు ఫుట్‌బాల్ క్రీడలో జాతీయస్థాయిలో పాల్గొని పతకాలు పొందాను. మా గ్రామంలో మరో 20 మందికి పైగా ఆయా క్రీడల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు.

–ఆనంద్‌రాజ్, జాతీయస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడు



మెట్టు గ్రామానికి చెందిన క్రీడాకారులు

సంఘ సంస్కర్తల సేవలు మరువలేనివి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

రుద్రూర్: సమాజంలో మార్పు కోసం, సంస్కరించేందుకు సంఘ సంస్కర్తలు లవణం, హేమలత లవణం నిస్వార్థంగా అందించిన సేవలు మరవలేనివని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని అక్బర్‌నగర్ సంస్కార్ ప్రకృతి చికిత్సాలయంలో ఏర్పాటు చేసిన లవణం, హేమలత విగ్రహాలను గురువారం ఆయన ప్రకృతి వైద్యులు మంతెన సత్యనారాయణ రాజు, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో లవణం, హేమలత నిస్వార్థంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. కోటయ్య క్యాంపులో సంస్కార్ కార్యకలాపాలు నిలిచిన తర్వాత అక్కడ ఉన్న 12 ఎకరాల స్థలాన్ని లవణం ప్రభుత్వానికి దానం చేశారని అన్నారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. లవణం, హేమలత అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి ఆశ్రమ వ్యవస్థాపకుడు మార్ని రామకృష్ణరావు, ప్రకృతి వైద్యులు బైరి శ్రీనివాస్, యోగా మాస్టర్ బి.సాయిలు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సుందర్, మధుసూదన్ రావు, హరి సుబ్రహ్మణ్యం, వాసుదేవ రావు, సుందర్, ఏఎంసీ చైర్మన్లు సురేశ్ బాబా, హన్మంతు, మాజీ జడ్పీటీసీ నరోజి గంగారాం, వీండో చైర్మన్ సంజీవరెడ్డి, మాజీ చైర్మన్ పత్తి రాము తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న పోచారం

అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ

బోధన్ : సాలూర మండలంలోని మందర్నా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవన నిర్మాణానికి గురువారం కాంగ్రెస్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి భూమి పూజ చేశారు. అంగన్‌వాడీ నూతన భవనం నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.12 లక్షలు మంజూరైనట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, టీపీసీసీ డెలిగెట్ బి.గంగాశంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, బోధన్, సాలూర మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్నా రవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నందిని, జీపీ కార్యదర్శి శ్రీనివాస్, మహిళ గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు శకుంతల, గ్రామ పెద్దలు రాజుపటేల్, మాధవ రావు, సుభాష్ పటేల్, రమేశ్, సుధాకర్, నాగ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సొసైటీ చైర్మన్

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు బీజేపీ నాయకులు అందజేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో మంజూరు పత్రాలను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు లబ్ధిదారులకు అందించినట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోనె సంతోష్ తెలిపారు. అనంతరం పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాథోడ్ రాజశేఖర్, బండారి రాములు పాల్గొన్నారు.



మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

విపత్తులపై మాక్‌డ్రిల్

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గురువారం మున్సిపల్, రెవెన్యూ, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విపత్తులు సంభవించినపుడు ప్రజలు ఆందోళన చెందకుండా ప్రభుత్వ సూచనలు పాటించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, నాయకులు కోనపత్రి కాశీరాం, తవ్వన్న, హెచ్ఎం రవీందర్ పాల్గొన్నారు.

మంజీరలో..

బోధన్: సాలూర మండల శివారులోని మంజీర నదిలో వివిధ శాఖల అధికారులు, వరద సహాయ బృందం మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రస్తుతం భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో మంజీర నది పరివాహక ప్రాంతం, చెరువులు, వాగులు, వంకల్లో వరద ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని అన్నారు. బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మామిడిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

పొలంలో జెండావిష్కరణ

మోర్తాడ్(బాల్కొండ): జాతీయ పండుగల సందర్భంలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలపై జెండా ఎగురవేయడం సాధారణ విషయం. కానీ ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన రైతు ఎజాప రవీందర్ మూడేళ్ల నుంచి స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా తన పొలంలో జెండావిష్కరణ చేస్తున్నాడు. తోటి రైతులతో కలిసి జాతీయ గీతాలాపనతోపాటు ఇతర సంబురాలను పొలం వద్దనే నిర్వహిస్తున్నాడు. రవీందర్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అందరూ అభినందిస్తున్నారు.

ఉపాధ్యాయులకు ప్రదర్శన మేళా



డొంకేశ్వర్: ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు గురువారం మండల కేంద్రంలో టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్(ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎం)పై ప్రదర్శన మేళా నిర్వహించారు. కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి కృష్ణకుమార్, తహసీల్దార్ నరేశ్‌కుమార్, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై ఉపాధ్యాయుల ప్రదర్శనలు వీక్షించారు. విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు ఈ ప్రదర్శలు దోహదపడతాయని అన్నారు. ఎంఈవో రామకృష్ణ, హెచ్ఎం సురేశ్ కుమార్ ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రుద్రూర్: భారీ వర్షాల సూచన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తారాబాయి, ఎస్సై సాయన్న సూచించారు. మండలంలోని బొప్పాపూర్‌లో గురువారం స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న మూడు కుటుంబాలను కమ్యూనిటీ హాల్‌లోకి మార్చారు. ఎంపీడీవో భీమ్‌రావ్, జీపీ కార్యదర్శి చైతన్య ఉన్నారు. పాతంగల్‌లో బోధన్ డీఎల్‌పీవో నాగరాజు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

జీపీ కార్యాలయాల ఎదుట ధర్నా



నందిపేట్: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని కోరుతూ గురువారం ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో నందిపేట మండంలోని ఉమ్మెడ, మాయాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. నాయకులు కె.గంగాధర్, మహిళలు పాల్గొన్నారు.

తగిలేపల్లి రోడ్డుకు మరమ్మతులు

వర్ని: మండలంలోని తగిలేపల్లి రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంతో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు స్పందించి సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. కోటయ్య క్యాంపు నుంచి తగిలేపల్లి వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో తగిలేపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు స్పందించి రోడ్డు మరమ్మతులకు అయ్యే ఖర్చులు అభివృద్ధి కమిటీ నుంచి చెల్లిస్తామని మరమ్మతులను ప్రారంభించారు. గురువారం రోడ్డు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. కొత్త రోడ్డు వేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా స్పందించకపోవడంతో గ్రామాభివృద్ధి కమిటీ నుంచి రోడ్డు మరమ్మతులు చేయిస్తున్నట్లు గ్రామస్తులు వెల్లడించారు.



తగిలేపల్లి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

లో లెవెల్ వంతెన పరిశీలన



వర్ని : వర్షాల మూలంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో గురువారం పరిశీలించారు. మండలంలోని జలాల్‌పూర్ శివారులో ఉన్న సైదిపూర్ చెరువు అలుగులను, కోకల్ దాస్ తండా శివారులో లెవెల్ వంతెనను పరిశీలించారు. మరో రెండు రోజులు వర్షాలు ఉన్నందున సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

యువత ఓటు హక్కును నమోదు చేసుకోవాలి



ఆర్మూర్ : యువత ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఓటు హక్కు అనే అంశంపై రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, సీపీఐ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



తొండాకూర్ ఎస్ఎస్‌వీ పాఠశాలలో..



నందిపేటలోని గీతా కాన్వెంట్ పాఠశాలలో..



ఆర్మూర్ పట్టణంలోని స్మైల్ ద స్కూల్‌లో..

డొంకేశ్వర్/ నందిపేట్/ ఆర్మూర్/ బాల్కొండ: డొంకేశ్వర్ మండలంలోని ఎస్ఎస్‌వీ పాఠశాలలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో వచ్చి సంబురాల్లో పాల్గొన్నారు. ఆటపాటలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులతో ఉట్టి కొట్టించారు. పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి, ఉపాధ్యాయులు ఉన్నారు. నందిపేట మండల కేంద్రంలో శ్రీ గీతా కాన్వెంట్ పాఠశాలలో కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని స్మైల్ ద స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ షబానా గౌహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా అంటూ విద్యార్థులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.



ముప్కాల్ న్యూహరిజన్స్‌పాఠశాలలో..



బాల్కొండలోని వెంకటేశ్వర పాఠశాలలో..

సమాచారం..

నియామకం

మాక్లూర్: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ సంస్థ మాక్లూర్ చైర్మన్‌గా మండలంలోని గుంజ్లి గ్రామానికి చెందిన చామంతుల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆ సంస్థ జాతీయ చైర్మన్ కొప్పుల విజయ్‌కుమార్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. సంస్థ మండల చైర్మన్‌గా ఇక నుంచి మండలంలో సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు ప్రజలకు ఉన్న హక్కులు, బాధ్యతలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తానని ఆయన అన్నారు.

22న బీసీ సంక్షేమ సంఘం సమావేశం

బాల్కొండ: జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 22న తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి బీసీలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



డొంకేశ్వర్: మండలంలోని తొండాకూర్‌లో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. విగ్రహాల కోసం జెడ్పీ పాఠశాల ఎదుట ఆలయాన్ని నిర్మించారు. ఐదు రోజులపాటు ఉత్సవాలు జరగనుండగా, గురువారం యజ్ఞహోమాలు చేపట్టారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య గ్రామ దేవతలన్నింటినీ ఒకే దగ్గర ప్రతిష్ఠించారు. మహిళలు మంగళహారతులు, బోనాలతో దేవతలకు నైవేద్యాలు సమర్పించి అన్నదానం చేశారు. మాజీ సర్పంచ్ దేవన్న, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన

బోధన్‌రూరల్: మండలంలోని నాగన్‌పల్లిలో మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేసి నూతన విగ్రహాన్ని వేద పండితులు ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సంక్షిప్తం

జాతీయ జెండాల పంపిణీ



పాతంగల్/ కోటగిరి: పాతంగల్, కోటగిరి మండల కేంద్రాల్లో గురువారం బీజేపీ నాయకులు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జాతీయ సమైక్యతను చాటి చెప్పడానికి ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమాల్లో పాతంగల్, కోటగిరి మండలాల బీజేపీ అధ్యక్షులు భజరంగ్ హన్మాండ్లు, ఎముల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



బోధన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు గురువారం ఎడపల్లి మండల కేంద్రంలో బీజేవైఎం మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా ర్యాలీ జిల్లా కో-కన్వీనర్ కందగట్ల రాంచందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మోస్రా సాయి, ఉపాధ్యక్షుడు బట్టు రాజు, కార్యదర్శి రాకేష్, ప్రతినిధులు సాయి చంద్ర, సుధాకర్, కంజరి ప్రదీప్, అరుణ్,వేణు, శివచైతన్య, సాయిలు, గంగాధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



వేల్పూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్సై సంజీవ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వినాయక మండపాల నిర్వాహకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించిన నాటి నుంచి నిమజ్జనం అయ్యే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సభ్యులకు వివరించారు. సమావేశంలో గ్రామ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల, కోటగిరి మండలం దోమలెడ్గి శివార్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఈరెండు ట్రాక్టర్లను కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సునీల్ తెలిపారు.

విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలి

బోధన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులంతా సంఘటితంగా ఉద్యమించాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘంలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రతినిధులు సావిత్రి, జబ్బర్ నాయక్, జిల్లా కన్వీనర్ మోసిన్ తదితరులు పాల్గొన్నారు.